ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

బుధవారం 12 జూన్ 2024

బడిగంట మోగిన వేళ..

ముగిసిన వేసవి సెలవులు.. నేటి నుంచి పాఠశాలు షురూ

- తొలిరోజు ప్రారంభోత్సవాలకు ముఖ్యులు
- పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ
- విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు సైతం..
- పలు బడుల్లో పూర్తికాని మరమ్మతు పనులు
- జిల్లాలో మూతపడిన స్కూళ్లు తెరుచుకునేనా?!

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 : వేసవి సెలవులు ముగిశాయి. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో బడిగంటలు మోగనున్నాయి. బుధవారం నుంచి జిల్లాలోని స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. ఆటాపాటలకు టాటా చెబుతూ.. విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర సర్కారు పూర్తి చేసింది. కాగా, జిల్లాలోని పలు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించగా, ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

అన్ని యాజమాన్య స్కూళ్లు 1,054..

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో అన్ని యాజమాన్య పాఠశాలలు 1,054 ఉన్నాయి. 1వ తరగతి నుంచి 10 వరకు బాలురు 54,542, బాలికలు 49,998 మొత్తం 1,04,540 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.15 వరకు, ఉన్నత పాఠశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.45 వరకు నిర్వహించనున్నారు. కాగా, ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు కలిసి ఉన్నచోట ప్రాథమిక స్కూళ్లను ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగించనున్నారు.

నేటి ప్రారంభోత్సవాలకు ముఖ్యుల హాజరు..

వేసవి సెలవుల అనంతరం ఈనెల 12న పునఃప్రారంభం కానున్న పాఠశాలలను అందంగా ముస్తాబుచేశారు. జిల్లాలోని 18 మండలాల్లో ప్రతీ మండలానికి 3 నుంచి 6 పాఠశాలలను ఎంపిక చేసి, ఆయా పాఠశాలల ప్రారంభోత్సవాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రత్యేకాధికారులు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొననున్నారు.

పనులు పూర్తయ్యేనా?

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించి, ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దేందుకు మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు-676, ప్రాథమికోన్నత పాఠశాలలు-120, ఉన్నత పాఠశాలలు 102 మొత్తం 898 పాఠశాలలు ఉండగా వాటిల్లో మొదటి విడతలో 438 పాఠ శాలలను అమ్మ ఆదర్శ స్కూళ్లుగా ఎంపిక చేశారు. వాటిల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, మైనర్ రిపేర్లు చేసేందుకు ఏప్రిల్ నెలలోనే 25 శాతం నిధులు మంజూరు చేసి పనులుప్రారంభించారు. స్కూళ్ల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులు ముమ్మరంగా పనులు చేస్తున్నప్పటికీ ఒక్కరోజు మాత్రమే గడువు ఉండటంతో పనులు పూర్తవుతాయా! లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. కాగా, ఉపాధ్యాయులు నూతన విద్యార్థుల నమోదుతో పాటు పాఠశాలలకు వెళ్లి పారిశుధ్య పనులను నిర్వహించి తరగతి గదులను శుభ్రం చేయించారు.



మహబూబాబాద్‌లోని వెల్పుల సత్యం నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాణికి యూనిఫాంను అందజేస్తున్న మహిళా సంఘాల బాధ్యులు



కురవి మండలం గుండ్రాతిమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో చేతులు శుభ్రం చేసుకునేందుకు ఏర్పాటు చేసిన కుళాయిలు



శిథిలావస్థకు చేరిన కురవి మండలం తిర్లాపురం ప్రాథమిక పాఠశాల



రూప్లతండా ప్రాథమిక పాఠశాలలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు

మూతపడిన స్కూళ్లు తెరుచుకునేనా?

మహబూబాబాద్ జిల్లాలో డీఈవో ఆధీనంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు 898 ఉండగా, వాటిల్లో 143 పాఠశాలల్లో విద్యార్థులు లేక మూసివే శారు. రాష్ట్రప్రభుత్వం గతంలో మూతపడిన పాఠశాలలను ఈ విద్యా సంవత్సరం నిర్వహిస్తున్న బడిబాటలో ప్రచారం చేపట్టి విద్యార్థులను చేర్పించి పాఠశాలలను నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. కానీ, మూతపడిన పాఠశాలల్లో విద్యార్థులు నమోదై కొనసాగుతాయా! లేదా? అనే యథావిధిగా వేసివేయాల్సి వస్తుందా అనేది వేచిచూడాల్సిందే. వీటితో పాటు 15 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కూడా విద్యార్థులు లేక మూసివేశారు.

ముగ్గురు ఎంఈవోలతో పర్యవేక్షణ ఎలా?


జిల్లాలోని 18 మండలాల్లో ముగ్గురు మండల విద్యాధికారులుగా విధులు నిర్వహిస్తుండగా, పాఠశాలల పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎంఈవోలు కూడా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నవారే కావడం గమనార్హం.

బి.పూల్‌చంద్ మహబూబాబాద్, బయ్యారం, గార్ల, డోర్నకల్, కురవి, సీరోలు, మరిపెడ, చిన్నగూడూరు 8 మండలాలకు, జి.రాము దంతాలపల్లి, నర్సింహుల పేట, నెల్లికుదురు, తొర్రూరు, పెద్దవంగర 5 మండలాలకు, శ్రీదేవి కేసముద్రం, గూడూరు, కొత్తగూడ, గంగారం, ఇనుగుర్తి 5మండలాలకు

మిగతా 6వ పేజీలో..

పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ

రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి



జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. నేటి నుంచే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలు అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే అన్ని స్కూళ్లకు నూతన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ అందించటంతో పాటు యూనిఫాం కూడా టైలర్ల వద్ద నుంచి పాఠశాలలకు చేరవేశాం. బుధవారం జరిగే పాఠశాలల ప్రారంభానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, ప్రత్యేకాధికారులు, జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు హాజరుకానున్నారు.

'కంకర క్రషర్ మిల్లును మూసివేయాలి'

- అర్పనపల్లిలో గ్రామస్థుల రాస్తారోకో



అర్పనపల్లిలో రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

కేసముద్రం, జూన్ 11 : మండలంలోని అర్పనపల్లిలో కంకర క్రషర్ మిల్లుతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వాటిని మూసివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆ గ్రామంలో రాస్తారోకో నిర్వహించారు. గ్రామ కూడలిలో కేసముద్రం-గూడూరు, కాట్రపల్లి ప్రాంతాలకు వెళ్లే రహదారిపై గ్రామస్తులు, యువకులు బైఠాయించి ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామశివారులో ఉన్న కంకరమిల్లులో బండరాళ్లను పగులగొట్టేందుకు శక్తివంతమైన బాంబులను వాడుతున్నారని ఆరోపించారు. సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇలాగే బాంబులను పేల్చడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారని, ఇళ్లు కంపించి, గోడలకు బీటలు బారినట్లు తెలిపారు. అనుమతులు ఉన్నవాటి కంటే అధికంగా పేలుడు పదార్థాలను ఉపయోగించి, ఒకేసారి పెద్ద గుట్టను పగులగొట్టడం వల్లనే ఇళ్లు కంపిస్తున్నాయని ఆరోపించారు. గతంలో ఒకసారి ఇలాగే జరిగిందని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిం చినట్లు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో ఫలితంగా వాహనాలు నిలిచిపోవడంతో విష యం తెలుసుకున్న కేసముద్రం ఎస్ఐ వంశీధర్ గ్రామానికి చేరుకొని ఆందోళన కారులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. అనంతరం తహసీల్దార్ దామోదర్, ఎస్ఐ వంశీధర్‌లు క్రషర్‌మిల్లును, పేలుడు జరిపిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ విషయంపై భూ గర్భగనుల శాఖాధికారులకు సమాచారం ఇచ్చామని, ఎంత తీవ్రతతో పేలుడు జరిపారనే విషయంపై వారితో కలిసి సంయుక్త విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు14 వరకు పెంపు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్11 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడువును ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. 14 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులుhttps://iti.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్, వెబ్ ఆప్షన్‌ల ద్వారా సీట్ల భర్తీ ఉంటుందన్నారు. వెరిఫికేషన్ ఫీజు గేట్‌వే లింక్‌ద్వారా 'ఆన్‌లైన్'లో సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నెంబర్లకు సమాచారం అందించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మానుకోట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

సాధారణ బోగీల కోసం సమరం!

- మానుకోట నుంచి కోటి ఉత్తరాల పోరుకు శ్రీకారం
- తెలుగు రాష్ట్రాల్లో ఊపందుకున్న నినాదం
- రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలనేదే అందరి డిమాండ్
- ప్రధానికి చేరడమే లక్ష్యంగా ప్రారంభించిన మానుకోట వాసి

5 లో..



కురవి మండలం నేరడలో కోటి ఉత్తరాల కార్యక్రమం

కొత్త కమిటీతో మళ్లీ విచారణ జరిపిస్తా

ఏఈవోలకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ హామీ

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్11 :తొర్రూరు మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు పక్కదారి పట్టిన కేసులో కొత్త కమిటీనివేసి, మళ్లీ విచారణ జరిపిస్తానని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఏఈవోలకు హామీ ఇచ్చారు. ఇటీవల పచ్చిరొట్ట విత్తనాలు విక్రయాల్లో బ్లాక్ మార్కెట్‌లో జరిగిన దందాలో సస్పెండ్‌కు గురైన ముగ్గురు ఏఈవోలు అరవింద్, దీపిక, జమునలతో పాటు జిల్లా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలిసి, ఆయనకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఈవోలతోపాటు జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఏఈవోలను అన్యాయంగా వ్యవసాయాధికారులు సస్పెండ్ చేశారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ ఘటనపై రోజువారీగా జరిగిన వివరాలను కలెక్టర్‌కు ఏఈవోలు వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ ఈ విషయంలో తప్పుచేస్తే ఇంటికి పంపిస్తానని, దానికి సిద్ధమేనా అంటూ ఏఈవోలను ప్రశ్నించారు. తప్పు చేయకుంటే మళ్లీ విధుల్లోకి తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.



కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందచేస్తున్న సస్పెండైన ఏఈవోలు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ప్రస్తుతం నడుస్తున్న విచారణ అధికారికి ఇవ్వకుండా మరో విచారణ అధికారిని నియ మించాలని ఏఈవోలు కోరడంతో, ఇందుకు స్పందించిన కలెక్టర్ కొత్త కమిటీని ఏర్పాటు చేసి మళ్లీ విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలోని ఏఈవోల సంఘం ప్రతినిధులు రామకృష్ణ, సుమన్, రాజు, సాయిచరణ్ పాల్గొన్నారు.

రైతువేదిక ముందు నిరసన..

పచ్చిరొట్ట విత్తనాల ఘటనలో సస్పెండూర హరిపిరాల, అమ్మాపురం, వెలికట్టే క్లస్టర్‌ల ఏఈవోలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని జిల్లాలోని కొంత మంది ఏఈవోలు మంగళవారం మహబూబాబాద్ రైతు వేదిక ఎదుట నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలోని వివిధ సంఘాల ఏఈవోలు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో బస్సు ఇంజిన్‌లో మంటలు

అప్రమత్తమై ఆర్పివేసిన ఆర్టీసీ సిబ్బంది

డోర్నకల్, జూన్11 : డోర్నకల్ నుంచి ఖమ్మంకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆర్టీసీ బస్సు డోర్నకల్ నుంచి ఖమ్మం బయలుదేరింది. అదే సమయంలో బస్సు ఇంజన్ నుంచి పొగలు రావడం గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును నిలుపుదల చేసి, ప్రయాణికులను కిందకుదించారు. బస్సు ఇంజన్‌పై ఉన్న బోర్డును తొలగించి చూడగా షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వస్తున్నట్లు గుర్తించారు. దీంతో అక్కడే ఉన్న స్థానికులు నీరు తీసుకువచ్చి మంటలపై చల్లి ఆర్పివేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. బస్సు ప్రయాణిస్తున్న సమయంలో మంటలు వస్తే పెద్దప్రమాదం చోటు చేసుకునేదని ప్రయాణికులు కాసేపు భయాందోళనకు గురయ్యారు. మరమ్మతుల అనంతరం బస్సు ఖమ్మంకు బయలుదేరి వెళ్లింది.





షార్ట్ సర్క్యూట్‌తో ఇంజన్‌లో మంటలు వ్యాపించిన బస్సు ఇదే

సార్వత్రిక వ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకా

డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

నెహ్రూసెంటర్, జూన్ 11 : పోషకాహార లోపం ఉన్న వారికి బీసీజీ టీకా సార్వత్రిక వ్యాధి నిర్మూలనకు దోహదపడుతుందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్‌లోని ఐఎంఏ హాల్లో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో, టీబీ పేషెంట్, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహార లోపం ఉన్న వారికి 18 ఏళ్ల కన్న తక్కువ వయస్సు ఉన్న వారికి గత మూడు నెలల్లో రక్తమార్పిడి, హెచ్ఐవీ సంక్రమణ ఉన్న వ్యక్తులకు ఈ వ్యాక్సిన్ ఇవ్వకూడదని పేర్కొన్నారు. జిల్లాలోని పెద్దలకు ఉచితంగా బీసీజీ వ్యాక్సిన్‌ను అందించేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. జిల్లాస్థాయి శిక్షణ పూర్తయిన తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, హెల్త్‌సబ్‌సెంటర్లలో క్షేత్రస్థాయిలో బీసీజీ వ్యాక్సినేషన్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణార్జునరావు, మురళీధర్, అంబరీష, కేవీ రాజు, వడ్డెబోయిన శ్రీనివాస్, రామకృష్ణ, సౌమిత్, రవి, నీలిమా, శ్వేత, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో కళావతిబాయి

గండి చెరువు అటవీప్రాంతంలో కలప పట్టివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గూడూరు, జూన్ 11 : జిల్లాలోని గూడూరు సెక్షన్, బీట్ పరిధిలో ఉన్న గండి చెరువు అటవీప్రాంతంలో అటవీ శాఖ అధికారులు మంగళవారం రాత్రి కలప స్వాధీనం చేసుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన 'అడవితల్లికి గుండెకోత, అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అటవీశాఖ అధికారులు స్పందించారు. ఈ కథనం అటవీశాఖలో కదలికను తీసుకువచ్చింది. గండి చెరువు అటవీప్రాంతంలో టేకు, ఇతర జాతుల చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. ఈ కలపను తరలించడానికి వీలుగా నిల్వ చేశారు. సమాచారం తెలుసుకున్న గూడూరు అటవీశాఖ ఎఫ్‌డీవో చంద్రశేఖర్, రేంజ్ అధికారి సురేష్, డీఆర్వో మాధవి, సెక్షన్ అధికారులు శ్రీనివాస్, పత్రి వెంకటేశ్వర్లు అడవిలోని కలపనిల్వ చేసిన ప్రాంతానికి చేరుకున్నారు. ఆ దుంగలను పరిశీలించి, లెక్కించారు. సుమారు 50 నుంచి 60 దుంగలు ఉన్నట్లు నిర్ధారించారు. ఈ కలప అం చనా విలువ రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్య ఉంటుం దని ఎఫ్‌డీవో చంద్రశేఖర్ తెలిపారు.



గూడూరు రేంజ్ శివారు గండి చెరువు అటవీప్రాంతంలో పట్టుబడిన కలపను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

స్మగ్లింగ్ జరగకుండా చర్యలు చేపడతాం : ఎఫ్‌డీవో

కొత్తగూడ, గంగారం, గూడూరు అటవీశాఖ రేంజ్ పరిధిలోని అటవీప్రాంతంలో కలప నరికివేత, తరలింపుకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని గూడూరు ఎఫ్‌డీవో చంద్రశేఖర్ తెలిపారు. అక్కడక్కడ స్మగ్లింగ్ జరుగుతుందని ఈ విషయాలు తమ దృష్టికి రాగానే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ప్రతిరోజు అటవీ శాఖ సిబ్బంది అడవుల్లో గస్తీ చేయడం జరుగుతుందన్నారు. బీట్ పరిధిలో తనిఖీలు ముమ్మరం చేయనున్నట్లు చెప్పారు. స్మగ్లింగ్ నివారణ కోసం రాత్రిపూట అటవీలో పెట్రోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటవీలో నిర్వహించే గస్తీ, అటవీ సంరక్షణ పనులను పర్యవేక్షించేందుకు వనసంరక్షణ్ అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా అటవీసిబ్బంది కదలికపై నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. అటవీ నేరాల విషయంలో ఎటువంటి ఉదాసీనత వహించకూడదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అటువంటి నేరాలు ఎక్కడైనా జరిగితే బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

విత్తన కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 11: రైతాంగానికి అవసరమయ్యే జీలుగ, పచ్చిరొట్ట తదితర విత్తనాల కుంభకోణంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. 1660 బస్తాలు బోగస్ పేర్లతో ఇతర రాష్ట్రాలకు తొర్రూరు వ్యవసాయాధికారి అమ్ముకుంటే విచారణ చేపట్టిన అధికారి పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా తప్పుడు నివేదిక అందించారన్నారు. సుమారు రూ.20లక్షల మేర కుంభకోణం జరిగినా ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి జోక్యం చేసుకుని సమగ్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాకుండా ఇతర అధికారులను పంపించి మొక్కుబడి విచారణ వల్లే జరిగిన అవినీతి అక్రమ కుంభకోణం బయటికి రావడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో ఆగ్రోస్ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతుంటే వ్యవసాయాధికారులు కన్నెత్తి చూడకపోవడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, పాపారావు, అనిల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హైని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులెవరూ నష్టపోకుండా పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించి ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరించాలని కోరారు. అభ్యంతరాలను సానుకూల దృక్పథంతో పరిష్కరించి పారదర్శక సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పీఆర్టీయూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షుడు రొండ్ల భానుప్రసాద్, నాయకులు డి. మాలకొండారెడ్డి, జి. రాజు పాల్గొన్నారు.



డీఈవో అబ్దుల్ హైకి వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20లక్షలకు టోకరా

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల, జూన్ 11: మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని పీక్లీ తండాకు చెందిన బోడ సంజీల్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.20 లక్షలు తీసుకున్నారని, దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్‌కు చెందిన దాసరి రమ్య-వంశీ దంపతులు ఇంట్లో సంజీల్ అక్క భూక్యా ఉష ఏడాది కాలం నుంచి పని చేస్తోంది. ఈ క్రమంలో తమ తమ్ముడు సంజీల్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని రమ్య-వంశీలను ఉష ప్రాధేయపడింది. దీంతో కొంత డబ్బు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తాని చెప్పి దంపతులు నమ్మబలికారు. రూ.20 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు విడతల వారీగా ఫోన్‌పే, అకౌంట్ ద్వారా డబ్బులు చెల్లించారు. అయినప్పటికి ఉద్యోగం చూపించకపోవడంతోరమ్య-వంశీపై సంజీల్ గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న పరికిపండ్ల అశోక్, తదితరులు

సాధారణ బోగీల కోసం సమరం

- మానుకోట నుంచి కోటి ఉత్తరాల పోరుకు శ్రీకారం
- తెలుగు రాష్ట్రాల్లో ఊపందుకున్న నినాదం
- రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలనేదే అందరి డిమాండ్
- ప్రధానికి మోదీకి చేరడమే లక్ష్యంగా ప్రారంభించిన మహబూబాబాద్ వాసి

మహబూబాబాద్ టౌన్, జూన్ 11 : ప్రతీ రైలులో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి.. అవి సాధారణ ప్రయాణికులకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రవేశ ద్వారాల్లో వేలాడుతూ.. అవస్థలు పడుతూ ప్రయాణిస్తుంటారు. దేశంలో ప్రతీరోజు రైళ్లలో దాదాపు 30లక్షల మంది ప్రయాణిస్తున్నారని ఓ అంచనా. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని.. అప్పుడే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, దేశ వ్యాప్తంగా రైళ్లలో సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధాని మోదీ దృష్టికి తీసుకు పోవాలన్న లక్ష్యంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మార్చి 8న ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితిని ఏర్పాటు చేసి శ్రీకారం చుట్టిన ఈ ఉద్యమం మూడునెలల కాలంలోనే తెలుగురాష్ట్రాలకు పాకింది. మూడునెలల్లో ఆయన తెలంగాణలో 29 జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని విస్తృత పర్చారు. ఇక ఈ ఉద్యమం గురించి వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ వారు సైతం ప్రధానికి ఉత్తరాలు రాస్తున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌కు జీవనోపాధికోసం వెళ్లిన తెలుగు ప్రజలు కూడా కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల ఉత్తరాలను ప్రధానికి రాసినట్టు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు.

ఉద్యమానికి బీజం ఇలా..

మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళ్లేందుకు 2024 మార్చి 8న మానుకోట పట్టణానికి చెందిన రైళ్లలో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రాగా ఆ రైలుకు ముందు భాగంలో ఇంజన్ వెనుక ఒక జనరల్ బోగీ, వెనుక భాగంలో మరో జనరల్ బోగీ ఉంది. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ గర్భిణి చిన్నపాపతో కోణార్క్ రైలు ఎక్కేందుకు ప్రయత్నించి, కింద పడిపోయింది. చంకలో ఉన్న పాప తలకు దెబ్బతగిలింది. వెంటనే 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆరు రోజుల తర్వాత అభంశుభం తెలియని ఆ పాప చనిపోయింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ గర్భిణికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

కొద్ది రోజుల తర్వాత గర్భంలో ఉన్నపిండం కూడా చనిపోయిందని తెలిసింది. దీం తో చలించి పోయిన పరికిపండ్ల అశోక్ ఈ తప్పు ఎవరిది? శిక్ష ఎవరికి? అని ఆలోచించి, సాధారణ ప్రయాణికుల బాధలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లి సరిష్కరించాలని కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న సాధారణ ప్రయాణికులు (ఫైల్)

20 ఏళ్ల నుంచి రెండు సాధారణ బోగీలే..

దేశ వ్యాప్తంగా రోజురోజుకు జనాభా వృద్ధి చెంది రైలు ప్రయాణికులు పెరుగుతున్నప్పటికి రైళ్లల్లో మాత్రం జనరల్ బోగీల సంఖ్య మారడం లేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట నుంచి ఇప్పటికి ప్రతీ రైలులో రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉంటున్నాయి. నిత్యం వ్యాపార, ఉద్యోగ పనుల నిమిత్తం నిత్యం ప్రయాణించే వారి సం ఖ్య విపరీతంగా పెరుగుతూ వస్తోంది. రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండడంతో సాధారణ ప్రయాణికులు రైలు ఎక్కాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఏవో ఇబ్బందులు పడి రైలు ఎక్కినప్పటికి గమ్యస్థానం చేరేంత వరకు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రపంచంలో అతి పెద్ద రవాణావ్యవస్థగా ఉన్న భారత రైల్వేశాఖ ఈ సమస్యను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎల్లలు దాటిన కోటి ఉత్తరాల కార్యక్రమం..

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలని మానుకోట నుంచి ఆరం భమైన ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమం ఒక్క జిల్లానే కాదు..! ఒక్క రాష్ట్రం కాదు.. ఎల్లలు దాటి దేశవ్యాప్తమైంది. సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలంగాణ రాష్ట్రంలోని 29 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 18 జిల్లాలు గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో, పాండిచ్చేరి సమీపంలోని యానంలో కూడా స్వయంగా కోటి ఉత్తరాల ఉద్యమంపై అవగాహన కల్పించారు. భారత దేశంలో 140 కోట్లకు చేరువైన జనాభాలో సుమారు ప్రతీరోజు 30 లక్షల మంది ప్రయాణికులు రైళ్ల ద్వారా ప్రయాణి స్తున్నారని, సాధారణ ప్రయాణీకుల బాధలను గుర్తించి అందరూ ప్రధానికి ఉత్తరం రాయాలని కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజల మద్దతు లభించడంతో ఇప్పటికే దాదాపుగా 8 లక్షల వరకు ప్రధానికి ఉత్తరాలను పంపి ఉండవచ్చని చెబుతున్నారు. ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి

డాక్టర్ పరికిపండ్ల అశోక్, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, మానుకోట



ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి. రైళ్లలో జనరల్ బోగీలు ఎక్కువగా లేకపోవడంతో నిత్యం ప్రయాణించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రైలుఎక్కే సమయంలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో, కొందరు ఎక్కలేక పోతున్నారు. మరి కొంతమంది రైలు ఎక్కే సమయంలో జారి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలి.



ప్చ్.. చిప్స్ లేవే..!

చెట్టుపైనున్న ఓ ఉడత.. ఎవరో తినిపడేసిన చిప్స్‌ప్యాకెట్‌ను చూసింది. అందులో ఏమైనా తినడానికి దొరుకుతాయేమోనని ఆశపడింది. ఎంతో ఆత్రుతగా.. ఆశగా చెట్టుపై నుంచి దిగి వచ్చింది. ఆ ఖాళీ ప్యాకెట్‌ను అటు.. ఇటు.. కిందికి.. పైకి తిప్పి చూసింది. కానీ అందులో ఏమీ దొరక్కపోవడంతో.. చివరకు ప్యాకెట్‌కు అంటుకుని ఉన్న కాస్తంత చిప్స్ పొడిని ఆస్వాదించి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ముఖ్యమంత్రిని కలిసిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 11 : తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా నియమి తులైన మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిని కలిసిన తరువాత ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు తదితర కాంగ్రెస్ ముఖ్య నేతల ను కలిశారు. చైర్మన్‌గా నియమితులైన రవీందర్‌రావుకు అభినందనలు తెలియచేశారు. టెస్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రావు సాయంత్రం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్‌కు చేరుకున్నారు. బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ ఉద్యోగులు, సీఈవోలు తదితరులు ఆయనకు భారీ పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో మార్నేనిని సన్మానించారు. టెస్కాబ్ చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా రవీందర్‌రావు పేర్కొన్నారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి

- అధిక లోడ్, అంతరాయాల నివారణకు ప్రత్యేక చర్యలు
- త్వరలో 35 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- 'ఆంధ్రజ్యోతి'తో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జూన్ 11 : ఎన్పీడీసీఎల్ పరిధిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను అందించేందుకు శక్తి వంచనలేకుండా కృషిచేస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో తీసుకోబోతున్న చర్యల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మానవ ప్రమేయం లేకుండా సాంకేతికను జోడించి అంతరాయాలకు సంబంధించిన సమస్యలను కార్పొరేట్ ఆఫీస్ నుంచి గుర్తించి సత్వర చర్యలు చేపట్టేలా ఆర్‌టీడీఏస్, ఎస్ఏడిఏను ప్రతీ సబ్‌సబ్‌స్టేషన్‌లో అమర్చబోతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు 800కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించామని, మరో 300కిల్లోమీటర్లకు త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న లెంతీలైన్‌ల మధ్య అంతరాయాలు తగ్గించేందుకు ప్రతీ 5 కిలోమీటర్లకు ఒక పాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయాలకు, ప్రమాదాలకు కారణమవుతున్న లూజ్ లైన్‌లను చాలా వరకు సవరించడం జరిగిందని, ఇంకా అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న లూజ్ వైర్లను సవరించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అధికలోడును తగ్గించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో త్వరలోనే 35 సబ్‌స్టేషన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఎన్పీడీసీఎల్ పరిధిలో 2156 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 1995 లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చడం జరిగిందన్నారు. కాగా, ఉమ్మడి వరంగల్‌లో 402 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్‌లైన్‌గా మార్చడం జరిగిందన్నారు. మిగితా వాటిని మార్చేందుకు వేగంగా పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.

మార్కెట్‌లో వ్యాపారుల ఆందోళన

- డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటున్న ఆగ్రహం
- నిబంధనల మేరకే నడుచుకున్నామన్న అధికారులు



మార్కెట్ కార్యాలయంలో ఆందోళన నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు

వరంగల్ వ్యవసాయం, జూన్ 11: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు ఆందోళనకు దిగారు. పర్మిట్ బుక్కులు ఇవ్వకుండా, ఏదో ఒకసాకుతో డబ్బులు గుంజేలా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ అధికారులతో చాంబర్ ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. మంగళవారం ఉదయం కరానీ ఖరీదుదారుడికి సంబంధించిన గుమస్తా మార్కెట్ కార్యాలయంలోని సూపర్‌వైజర్ మురళీ వద్దకు వెళ్లి పర్మిట్ బుక్కులను ఇవ్వాలని కోరాడు. సూపర్‌వైజర్ 2024 కొత్త నామ్స్ ప్రకారం ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ 1 నుంచి 10 ప్రొఫార్మా కావాలని, అది ఇస్తే పర్మిట్ బుక్కులు ఇస్తానని చెప్పడంతో సదరు గుమస్తా అక్కడ జరిగిన విషయాన్ని యజమానికి వివరించాడు. కరానీ యజమానితోపాటు చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మార్కెట్ కార్యాలయానికి చేరుకుని సూపర్‌వైజర్‌తో పాటు గ్రేడ్ 2 కార్యదర్శి రాముతో వాగ్వాదానికి దిగారు. పర్మిట్ బుక్కులు ఎందుకు ఇవ్వరని, వ్యాపారుల నుంచి డబ్బులు గుంజాలని చూస్తున్నారంటూ గొడవకు దిగారు. కొత్తగా వచ్చిన నిబంధనల మేరకే ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ షీట్ అడిగామని, డబ్బులు అడగలేదని గ్రేడ్ 2 కార్యదర్శి చెప్పే ప్రయత్నం చేసేనా వారు పట్టించుకోలేదు. చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మినీ చాంబర్ కార్యాలయంలో సమావేశమయ్యారు.

జమ్మికుట మార్కెట్‌కు వెళ్లిన మార్కెట్ కార్యదర్శి

ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి మంగళవారం జమ్మికుంట మార్కెట్ వెళ్లారు. మార్కెట్లో గొడవ జరిగిన సమయంలో మార్కెట్లో లేరు. దీంతో చిన్న విషయం కాస్తా పెద్దగా తయారైంది. జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా కార్యకలాపాలు ఎలా నడుస్తున్నాయో చూసేందుకు వెళ్లారు. ఏనుమాముల మార్కెట్లో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో అధికారులు మార్కెట్లో జరిగిన విషయాన్ని మార్కెట్ కార్యదర్శికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన మార్కెట్ కార్యదర్శి ఏనుమాముల మార్కెట్‌కు చేరుకున్నారు.

మార్కెట్లో చాంబర్ ప్రతినిదులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏనుమా ముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి, మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు ఏనుమాముల మార్కెట్‌కు చేరుకుని అధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

చాంబర్ ప్రతినిధులతో అధికారుల సమావేశం

మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశం, డీడీ అజ్మీరాజు, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, మడూరి వేదప్రకాష్, అల్లె సంపత్, అలాగే కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, కరాని రాజు తదితర వ్యాపారులతో సమావేశమయ్యారు. సమస్య సద్దుమనిగేందుకు అధికారులు కృషి చేశారు. 2024 నిబంధనల మేరకు ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ ఫాం 1 టు10 ప్రొఫార్మా ప్రతీ నెల 10వ తేదీలోపు ఇవ్వాల్సి ఉండగా దానిని 20వ తారీకు వరకు ఇచ్చేందుకు చాంబర్ ప్రతినిధులు గడువు కోరారు. పర్మిట్ బుక్కులు ఇవ్వాలంటే తప్పకుండా ప్రతీనెల పీఆర్ ఇవ్వాలని, మార్కెట్ ఫీజు 10 తారీకు లోపు చెల్లించాలని అధికారులు షరతు పెట్టారు. దానికి చాంబర్ ప్రతినిధులు కూడా ఒప్పుకోవడంతో సమస్య సద్దుమనిగింది.

'విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి నాడే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంబించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఎస్సెస్సీ ఫలితాల్లో కూడా ఉత్తమ మార్కులు సాధించిన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, స్థానిక శాసనసభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. డీఈవో వెంట సెక్టోరియల్ అధికారి సుధాకర్, హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు రంజాన్ అలీ, వీరస్వామి ఉన్నారు.

గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలి


మానుకోటలోని మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన ఐక్య సంఘాల నేతలు

● మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన

మహబూబాబాద్ టౌన్, జూన్11 : గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం గిరిజన ఐక్య సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన ఐక్యసంఘాల నాయకులు తేజావత్ వాసునాయక్, రమేష్‌నాయక్, ధరావత్ వెంకన్న మాట్లాడారు. వివాదస్పద భూములకు మునిసిపల్ అధికారులు ఇచ్చిన అనుమతులు తక్షణమే రద్దు చేయాలని కోరారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి శనిగపురం వీరారంతండాకు చెందిన భూక్య శ్రీను, వారి కుటుంబ సభ్యులకు సర్వే నెంబర్లు 275,278, 279 లలో ఉన్న వారసత్వ ఆస్తుల్లో కొంత భూమిని భూ కబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించుకుని వాటిని కబ్జాచేశారని చెప్పారు. 2012 నుంచి అధికారులకు వినతులు ఇస్తూ వారి గోడును చెప్పుకుంటున్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా గృహనిర్మాణ అనుమతులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు భూ యజమాని భూక్య శ్రీను ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం దరాఖాస్తు చేసుకుంటే మాత్రం మునిసిపల్ అధికారులు ఆ భూమి కోర్టు పరిధిలో ఉందని సాకులు చెబుతున్నారని మండి పడ్డారు. అధికారులు సమగ్ర విచారణ జరిపి, భూ కబ్జాదారులకు ఇచ్చిన గృహ నిర్మాణ అనుమతులు రద్దు చేసి భూక్య శ్రీను కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రాములు నాయక్, బోడ హరిలాల్, సేవ్యానాయక్, లాల్‌సింగ్, భావ్‌సింగ్ పాల్గొన్నారు.

మహిళా మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక

కేసముద్రం, జూన్ 11 : కేసముద్రం స్టేషన్‌లో మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం లిమిటెడ్‌కు మంగళవారం సహకార శాఖ ఎన్నికల అధికారి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం అధ్యక్షురాలిగా సందిరి అనసూర్య, ఉపాధ్యక్షురాలిగా డోలి సుగుణ, కార్యదర్శిగా సరళ, డైరెక్టర్లుగా ఫైస భద్రమ్మ, గుడిబోయిన లక్ష్మి, శీలం వెంకటలక్ష్మి, సందిరి రాజేశ్వరి, ఎర్రబోయిన రామక్క, సందిరి రాజేశ్వరిలను ఎన్నుకున్నారు.


కేసముద్రం మార్కెట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కార్మికులకు చార్జీలు ఇవ్వాలని ధర్నా

కేసముద్రం, జూన్ 11 : కేసముద్రం మార్కెట్ వెలుపల నేరుగా వ్యాపారుల కొనుగోళ్లపై కార్మికులకు కూలీ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ) జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న ఆధ్వర్యంలో మార్కెట్ కార్యాలయం ఎదుట మంగళవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ వ్యాపారులు మార్కెట్ వెలుపల వేబ్రిడ్జిల వద్ద నేరుగా రైతుల నుంచి సరుకులను కొనుగోళ్లు చేస్తూ కార్మికుల పేరుతో హమాలీ చార్జీలను రైతుల నుంచి కట్ చేసుకుంటున్నారని తెలిపారు. ఇలా కోత విధించిన చార్జీలను కార్మికులకు వ్యాపారులు చెల్లించడంలేదని ఆరోపించారు. మార్కెట్‌లో కార్మికుల కూలీ రేట్లను పెంచాల్సిఉండగా జాప్యం చేస్తున్నారని అన్నారు. వేల్పుల వెంకన్న, సముద్రాల మల్లయ్య, గుగులోత్ లక్ష్మణ్, సాంబయ్య, ఎస్‌కె.పాష, ఉప్పలయ్య, దడువాయి సంఘం అధ్యక్షుడు ఆంగోత్ మంగీలాల్, కంది వెంకన్న, శ్రీనివాస్, సాంబయ్య పాల్గొన్నారు.

జిల్లెల్లగూడెంలో వ్యక్తి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జూన్ 11 : మహబూబాబాద్ మండలం బ్రహ్మణపల్లి లక్ష్మీపురం శివారు జిల్లెల్లగూడెంకు చెందిన ఎస్‌కె. అజ్మతుల్లా ఈనెల 9 నుంచి కన్పించడం లేదని మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. జిల్లెల్లగూడెంకు చెందిన ఎస్‌కె.అజ్మతుల్లా ఆదివారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడని చెప్పారు. తెల్లవారుజామున అజ్మతుల్లా లేకపోవడంతో కుటుంబసభ్యుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో తండ్రి ఇమామ్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికరెడ్డి తెలిపారు.

గుడుంబా నిర్మూలనకు కృషి చేయాలి

● జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్

నెహ్రూసెంటర్, జూన్ 11 : జిల్లాలో గుడుంబా నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్‌సూపరిండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఏటిగడ్డతండా, గిరిప్రసాద్‌నగర్ కాలనీ, సాలార్‌తండా, చిట్యాల గోపయ్యనగర్, కురవి మండలంలోని జగ్యాతండాల్లోని గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. అనంతరం గుడుంబా తయారీదారులకు నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా ప్రకటించేందుకు అందరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా గుడుంబా తయారీ, విక్రయించిన అక్రమంగా రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో బానోత్ కిష్టు, రజిత, సిల్కి, గుగులోతు జగ్గమ్మను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి, డీటీఎఫ్ సీఐ సీహెచ్.నీరజ, ఎస్టీఎఫ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై మౌనిక, డీటీఎఫ్ ఎస్సై ఆర్.కిరిటి, ఎస్.శివకృష్ణ పాల్గొన్నారు.



ఏటిగడ్డతండాలో మాట్లాడుతున్న కిరణ్‌నాయక్

బడిగంట మోగిన వేళ..

(3వ పేజీ తరువాయి)

ఎంఈవోలుగావిధులు నిర్వహిస్తున్నారు. కొసమెరుపేంటంటే ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కూడా 2023 సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో ఇతర జిల్లాలకు వెళ్లిన వారే.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ


సోమ్లతండా ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్డి

పాఠశాలలు బుధవారం (నేటి) నుంచి పునఃప్రారంభం కానుండగా, స్కూళ్లకు వచ్చే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మే నెలలోనే జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను మం డలకేంద్రాలకు చేర్పించి, తర్వాత పాఠశాలలకు చేరవేశారు. దీంతో పాటు యూనిఫాం క్లాత్‌ను కూడా మండల కేంద్రాలకు చేరవేసి మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థుల కొలతలు సేకరించిన టైలర్లు యూనిఫాంలను కుట్టి పాఠశాలలకు అందజేశారు.

మధ్యాహ్న భోజనం కూడా..

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల ప్రారంభం రోజు నుంచే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంఅమలు చేయనున్నారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు గోదాంల నుంచి మండల విద్యావనరుల కేంద్రాలకు బియ్యాన్ని చేరవేశారు. ఆరంభమైన రోజున జిల్లాలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించిన బియ్యాన్ని ప్రధానోపాధ్యాయులు తీసుకువెళ్లనున్నారు. బడిబాట ద్వారా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు వంట ఏజెన్సీ వాళ్లను కూడా వంట వండేం దుకు అప్రమత్తం చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పూర్తిస్థాయిలో మౌళిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం గత ఏడాది 'మన ఊరు-మన బడి' కార్యక్రమం కింద తొలివిడతలో 316 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ ఏడాది అమ్మ ఆదర్శ పాఠశాలలుగా 438 ఎంపిక చేసి పనులు ప్రారంభించి, పనులు చేపడుతున్నప్పటికీ ఏదో ఒకలోటు కనిపిస్తూనే ఉండటం గమనార్హం.

మున్నూరుకాపులు రాజకీయంగా ఎదగాలి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు

మహబూబాబాద్ టౌన్, జూన్ 11 : మున్నూరు కాపులు రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదగాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న, పార్లమెంట్ ఎన్నికల్లో మున్నూరుకాపు సామాజికవర్గం నేతలు ఎంపీలుగా గెలవడంతో మహబూబాబాద్ పట్టణంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. కేక్‌కట్ చేసి, పంపిణీ చేశారు. ఈసందర్భంగా శంతన్‌రామరాజు మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలవడంతో పాటు కేంద్ర మంత్రిగా బండి సంజయ్ నియామకంతో మున్నూరు కాపుల్లో నూతనోత్సహం వచ్చిందని చెప్పారు. విద్య, వైద్య, రాజకీయ రంగాల్లో మున్నూరుకాపులు మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని చెప్పారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుచేసి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో పవన్ కల్యాణ్ అన్నివర్గాలను ఏర్పాటు చేసి నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో యువతకు స్ఫూర్తిగా నిలవడం గర్వకారణమన్నారు. మున్నూరు కాపు సంఘం నాయకులు జిన్నారెడ్డి శ్రీనివాస్, పిట్టల రాము, పిట్టల శ్రీకాంత్, అవుల కుమార్, మద్దెల రమేష్, చంద్రశేఖర్, ఉపేందర్, జగ్గయ్య, కిశోర్, మహేష్, ప్రవీణ్ , సాగర్ పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 : జిల్లాలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యాసంవత్సరంలో 1వ, 5వ తరగతుల్లో ప్రవేశాలకు లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసినట్లు జిల్లా అధికారి బాల రాజు తెలిపారు. కలెక్టర్ సమావేశ కార్యాలయంలో మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్‌ల ఆధ్వర్యంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. 1వ తరగతిలో (నాన్-రెసిడెన్షియల్)కి గాను (47)సీట్లకు , 5వ తరగతి (రెసిడెన్షియల్)గాను(50) సీట్లకు భర్తీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల తల్లి దండ్రుల సమక్షంలో ఎంపిక చేసినట్లు తెలిపారు.

నేడు గిరిజన విద్యార్థులకు..

జిల్లాలో బెస్ట్ అవెలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజన విద్యార్థులను ఈ నెల 12న లక్కీడ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతముల నుంచి గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 2024-25 విద్యాసంవత్సరంలో 3వ, 5వ, 8వ తరగతుల్లో 169 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనుండగా 639 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

మానుకోట జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో 12న బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకము కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

'ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, జూన్ 11 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసే కుట్రలను ప్రతీ ఒక్కరూ ప్రతిఘటించాలని అఖిలభారత రైతుకూలీ సంఘం మండల కార్యదర్శి సోమిరెడ్డి పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మండలం రంగశాయిపేటలో మంగళవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. 2005లో ప్రారంభమైన ఉపాధి హామీ పథకం వందరోజుల పాటు లక్షలాది కుటుంబాలకు ఉపాధి, ఆదాయాన్ని కల్పిస్తుందన్నారు. వందరోజుల పని చేసినప్పటికి వారికి సరైన కూలీ చెల్లించడం లేదని చెప్పారు. ఉపాధి కూలీకి రోజుకు రూ.300 చెల్లించాలని చట్టంలో ఉన్నప్పటికి కేవలం రూ.200 మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. తక్షణమే ఉపాధి కూలీలకు రూ.300 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, శ్రీను, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మానుకోట పట్టణంలో స్కానింగ్ సెంటర్లలో ఆకస్మిక తనిఖీ

నెహ్రూసెంటర్, జూన్ 11 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మైత్రి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు విజయాస్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రుల్లోని అల్ట్రా సౌండ్ స్కానింగ్ రిపోర్టులను మంగళవారం ఎన్‌హెచ్ఎం పీవో బిందుశ్రీ ఆస్మీకంగా తనిఖీ చేపట్టారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో రేడియాలజిస్టులు, గైనకాలజిస్టులు మాత్రమే గర్భిణీలకు స్కానింగ్ నిర్వహించాలన్నారు. ప్రదా స్కానింగ్ సెంటర్లలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణికి లింగనిర్ధారణ పరీక్షలు చేయకూడదని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే 1994 యాక్ట్ ప్రకారం రూ.10 వేల రూపాయల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వైద్యశాఖ నిబంధనల ప్రకారం అన్నిరకాల సదుపాయాలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కావెటి మంగమ్మ, అరుణ్‌కుమార్ ఉన్నారు.

రాధక్క ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ నాయకులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 11 : గోదావరిలోయ రైతాంగ ప్రతిఘటన పోరాట నిర్మాత చంద్రపుల్లారెడ్డి జీవిత సహచరి రాధక్క ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఇటీవల అనారోగ్యంకు గురికాగా, కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ అస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందినట్లు వివరించారు. రాధక్క ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎన్నో వర్గపోరాటాల్లో పాల్గొన్నారని వారు పేర్కొన్నారు. ఆదివాసీ, గిరిజన రైతాంగ పోరాటాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్నారని చెప్పారు. రహస్య జీవితంతో పాటు బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారని చెప్పారు.

నా స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్య తీసుకోండి

● హైదరాబాద్ ప్రజావాణిలో తెలంగాణ ఉద్యమకారుడు అహ్మద్‌ఖాన్ విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, జూన్11 : పట్టణంలోని గుమ్ముడూరు ఏరియాలో నర్సంపేట రోడ్డులో తనకు వంశపారపర్యంగా వచ్చిన అసైన్డ్ స్థలంలో బీఆర్ఎస్‌కు చెందిన నేత అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని, అతనిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు అహ్మద్‌ఖాన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రజావాణిలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 287లో వంశపారపర్యంగా తనకు వచ్చిన అసైన్డ్ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అనేకమార్లు మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఎవరూ న్యాయం చేయలేదని వాపోయారు. జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడంతో ఆ నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను ఆదేశించినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ న్యాయం జరగకపోవడం వల్లనే హైదరాబాద్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తన భూమి తనకు దక్కేలా చూడాలని వేడుకున్నారు.

విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని బీఆర్ఎస్ మహబూబాబాద్ మండల అధ్యక్షుడు తేళ్ల శ్రీనివాస్ అన్నారు. అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో యాదవకాలనీ, ముదిరాజ్, హరిజన కాలనీల్లో మంగళవారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందించనున్నట్లు చెప్పారు. మాజీ సర్పంచ్ పూజారి మంగమ్మవెంకన్న, తేళ్ల యాకన్న, శంకర్, లక్ష్మారెడ్డి, బలాష్టి రమేష్, యుగేందర్, బాలాజీ, రామాచారి, శ్రీనివాస్, హైమ పాల్గొన్నారు.

అమినాపురంలో హైస్కూల్ బడిబాట

కేసముద్రం, జూన్ 11 : మండలంలోని అమినాపురంలో కేసముద్రం స్టేషన్ జడ్పీహైస్కూల్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి హైస్కూల్ స్థాయి విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం బి.రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణవేణి, మధు, యాదగిరి, మదమోహహన్, శ్రీనివాసులు, ఎం.సదయ్య, సురేష్, చందర్, భద్రాసింగ్, లక్ష్మీకుమారి, శ్రీవిద్య, సత్యనా రాయణ, జుబేర్ అలీ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి

కేసముద్రం, జూన్ 11 : కేసముద్రం స్టేషన్‌లో సోమవారం దగ్ధమైన మెడికల్ షాపు, ఆస్పత్రి నిర్వాహకులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ కోరారు. కేసముద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ అప్పులు తీసుకువచ్చి అద్దె ఇంట్లో మెడికల్ షాపు పెట్టుకొని జీవిస్తున్న పి.నరేష్, ఆర్ఎంపీ వైద్యుడు టి.వెంకటేశ్వర్లుకు ఈ ఘటనలో సుమారు రూ.15లక్షలు నష్టపోయారని అన్నారు. నరేష్ భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా కొద్దినెలల క్రితం గుండెకు రంధ్రంతో పుట్టిన కుమారుడికి రూ.3లక్షలు ఖర్చు చేసినప్పటికీ బతకలేదని తెలిపారు. వరుస నష్టాలతో నరేష్ ఆర్థికంగా కోలుకోలేని స్థితిలో ఉన్నాడని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ రామ్‌ప్రసాద్ బిస్మిల్ జయంతి

మహబూబాబాద్ టౌన్, జూన్11 : జిల్లా కేంద్రంలో నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ రామ్‌ప్రసాద్‌బిస్మిత్ జయంతిని నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారి పి.వెంకటేష్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో నాటి బ్రిటీష్ సేనలతో పోరాడిన యోధుడు, తన కవితలతో ఎందరో స్వాతంత్ర్య వీరులను తయారు చేశారని పండిట్ రామ్‌ప్రసాద్ బిస్మిల్ అని కొనియాడారు. నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు, వివేక్, రాణశంకర్, విశ్వనాథం, సామ శ్రీనివాస్, రవి, నవనీత్, జగన్, విజయ్, శ్రీనివాస్, ప్రజ్వల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

● వరంగల్ డివిజనల్ అగ్నిమాపక అధికారి భగవాన్‌రెడ్డి


సిబ్బంది పనితీరును పరిశీలిస్తున్న భగవాన్‌రెడ్డి

డోర్నకల్, జూన్ 11 : ప్రజలు అప్రమత్తంగా ఉంటే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని వరంగల్ డివిజనల్ అగ్నిమాపక అధికారి మామిడి భగవాన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డోర్నకల్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సమయంలో వెంటనే ఫైర్ స్టేషన్ సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. అలాగే సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అగ్నిమాపకకేంద్రంలోని పలురికార్డులను పరిశీలించారు. సిబ్బందితో డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది చంద్రమౌళి, శ్రీనివాస్, సంపత్, మహేష్, రాజేశ్వర్, విశ్వనాథ్, సతీష్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

కేసముద్రం, జూన్ 11 : విద్యాశాఖ నిబంధనలను పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్, సర్వీస్ సంస్థ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉచితంగా విద్యనందించే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

● ఎస్సై జీనత్‌కుమార్

గార్ల, జూన్11 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని గార్ల ఎస్సై జీనత్‌కుమార్ అన్నారు. మంగళవారం గార్లలోని నిర్వహించిన బాస్కెట్‌బాల్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. బాస్కెట్ బాల్ క్రీడల్లో మెళకువలు నేర్చుకుని మండలస్థాయి నుంచి జాతీయస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశారు. సూత్రపు జయశంకర్, సాంబమూర్తి, రామయ్య, తోడేటి రాము, కత్తుల ప్రశాంత్, బూర్ల చంద్రశేఖర్, ఆశిష్‌జైన్, ఉమేష్, పవన్, రిజ్వాన్, సిద్ధు, మేమన్ పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తాం

● సీజీఆర్ఎఫ్ చైర్మన్ గుట్టా

తొర్రూరు, జూన్ 11 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామని వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్‌గుట్టా అన్నారు. మంగళవారం తొర్రూరు సబ్‌స్టేషన్ పరిధిలోని తొర్రూరు, పెద్దవంగర మండలాల వినియోగదారుల సమస్యల పరిష్కారానికై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లుల లోపాలు, నూతన సర్వీసులు, సరఫరాలో జాప్యం, అదనపు లోడు, క్రమబద్ధీకరణ తదితర సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందాయని, 7గురు వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. వారి సమస్యలను 45 రోజుల లోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఏర్పడినా డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు బిలాల్ బాష, నరేందర్, డీఈ మధుసూదన్, ఏఈ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గార్ల, జూన్ 11 : తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో నేడు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందించనున్నట్లు తహసీల్దార్ రవీందర్ తెలిపారు. మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

శిఖం భూములకు రక్షణ కల్పించాలి

● మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమణి

గార్ల, జూన్ 11 : గార్ల పెద్ద చెరువు శిఖం భూములకు రక్షణ కల్పించి కాపాడాలని బీజేపీ మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమణి అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ రవీందర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గార్ల పెద్ద చెరువు కింద 3 వేల ఎకరాల భూమికి సాగునీరు అందుతుందని, ఇలాంటి చెరువును కొందరు కబ్జాదారులు జేసీబీల సాయంతో ఆక్రమించుకుంటున్నారని చెప్పారు. వెంటనే వారిపై చర్యలు తీసుకుని చెరువు శిఖం భూములను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు అజ్మీర సుమలత, పూనెం రాంబాబు పాల్గొన్నారు.

'ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య'

డోర్నకల్, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు బొడ్రాయితండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు అబ్దుల్ అజీజ్ అన్నారు. మంగళవారం బొడ్రాయితండాలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ.. పాఠశాలల్లో బడిఈడు పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుమ్మల వెంకటప్పయ్య, కాసుమారెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాదాలకు నిలయాలు రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

● పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో ప్రజలు

దంతాలపల్లి, జూన్ 11 : కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అమాయక ప్రజల ప్రాణాలు, పశువుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. విద్యుత్ అధికారులు నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడమే తప్ప, వాటికి కంచె ఏర్పాటు చర్యలు తీసుకోకపోవడం ప్రజలకు, పశువులకు శాపంగా మారింది. ఉమ్మడి నర్సింహులపేట మండలంలోని 21 గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 172 ట్రాన్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇందులో 29 ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. దంతాలపల్లి మండలంలో ఎక్కువగా విద్యుదాఘాతానికి పశులు బలి అవుతున్నాయి. ప్రమాదం సంభవించినప్పుడే అధికారులు ఉరుకులు పరుగులతో ఆర్భాటం చేస్తారని ప్రజలు ఆరోపిస్తున్నారు. 2014-2024 నాటికి మండలంలోని పలు గ్రామాల్లో 120 పశువులు విద్యుదాఘాతానికి మృతి చెందాయి. మండలంలోని 17 గ్రామాల్లో గత ఐదేళ్లలో 18 మంది విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషయం విదితమే. ఈఏడాది మండలంలోని తూర్పుతండాలో ఇద్దరు యువకులు విద్యుదాఘాతానికి బలైయ్యారు.

కంచెలేని ట్రాన్‌ఫార్మర్ ఉన్న గ్రామాలు

మండలంలోని 17 గ్రామాల్లో ట్రాన్స్‌పార్మర్లకు కంచెలేదు. ఆగాపేట శివారు తూర్పుతండా, దుబ్బతండా, రేఖ్యాతండా, రామవరం, ఎంపీడీవో కార్యాలయం సమీపన, ఎస్సీ కాలనీ, దంతాలపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లేరోడ్డు, పెద్దముప్పార -కుక్కడంకు వెళ్లే దారిపై, మెయిన్ బజారుతో పాటు పలు గ్రామాల్లో గల ట్రాన్స్‌పార్మర్‌ల వద్ద కంచెలేదు. వెంటనే విద్యుత్ అధికారులు కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ఆగాపేటలో రోడ్డు పక్కన కంచెలేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్